ఆమె బోధన వినూత్నం

- పిల్లలను ఆకట్టుకునే రీతిలో పాఠాలు
- వీడియోలు, చార్టుల రూపకల్పన
- సామాజిక మాధ్యమాల్లో లక్షల మంది వీక్షకులు -8లో
- పినగాడి ప్రాథమిక పాఠశాల ఎస్జీటీకి మంత్రి లోకేశ్‌ అభినందన

వన్నె తగ్గిన వలిసె

క్రమంగా క్షీణిస్తున్న సాగు విస్తీర్ణం




- ప్రతికూల వాతావరణం, ఆకాశ పందిరి మొక్కల బెడదే కారణం
- గతంలో 20 వేల ఎకరాల పైబడి సాగు.... ఇప్పుడు 500 ఎకరాలకు పరిమితం
- రాజ్‌మా పంటను ప్రత్యామ్నాయంగా సాగు చేస్తున్న రైతులు
- వలిసె విస్తీర్ణం తగ్గుదలతో తేనె ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం

పాడేరు మండలం మినుములూరు ప్రాంతంలో వర్షానికి పాడైన వలిసె పంట

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

మన్యంలోని ప్రకృతి అందాలకు ఎంతో శోభ తెస్తున్న పచ్చని వలిసె పూలు ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో వన్నె తగ్గుతున్నాయి. మన్యంలోని గిరిజనులు గత ఐదు దశాబ్దాలుగా వలిసె పంటను సాగుచేస్తున్నారు. కానీ పరిస్థితులు అనుకూలించకపోవడంలో క్రమంగా దానిని వదిలేసి, రాజ్‌మా సాగుపై దృష్టి పెట్టారు. దీంతో మన్యంలో వలిసె పూల సాగు విస్తీర్ణం రోజు రోజుకూ తగ్గుముఖం పడుతున్నది. ఈ పరిస్థితులు ఏజెన్సీలో తేనె ఉత్పత్తిపైనా తీవ్ర ప్రభావం చూపుతున్నాయి.

మన్యంలో గతంలో అంటే దశాబ్దం క్రితం వరకు గిరిజన రైతులు 20 వేల ఎకరాలు పైబడి వలిసె పంటను సాగు చేసేవారు. వారికి ప్రతి ఏడాది చక్కని ఆదాయం సమకూరేది. అలాగే మార్కెట్‌లో సైతం వలిసె పూలకు చక్కని డిమాండ్‌ ఉండడంతో రైతులకు గిట్టుబాటు అయ్యేది. దీంతో ఏజెన్సీలో కొయ్యూరు మినహా పది మండలాల్లోనూ గిరిజన రైతులు వలిసె పంటను విధిగా సాగు చేస్తుండేవాళ్లు. అలాగే అరకులోయ, డుంబ్రిగుడ, అనంతగిరి మండలాల్లో పచ్చని వలిసె పూలు పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తుండడంతో ఆయా ప్రాంతాల్లో విరివిగా వాటిని పండించేవారు. దీంతో అరకులోయ పర్యటన అంటే విధిగా పచ్చని వలిసె పూలలో ఫొటోలు, వీడియో తీసుకోవడం ఒక ఆనవాయితీగా మారింది. పలువురు సందర్శకులు కేవలం వలిసె పూల అందాలను తిలకించేందుకే అరకులోయ పర్యటనకు వచ్చేవారంటే అతిశయోక్తి కాదు. దీంతో మన్యం అంటే పచ్చని వలిసె పంట అన్నట్టుగా ఉండేది. కానీ ఆ స్థాయి నుంచి నేడు కేవలం 500 ఎకరాలకు మాత్రమే వలిసె సాగు పరిమితమైంది. ప్రధానంగా వలిసె పూల ద్వారా నూనెను తీసి వారి వంటకాలకు వినియోగించుకోవడంతో పాటు వాణిజ్యపరంగాను వాటిని వర్తకులకు విక్రయించేవారు. దీంతో వలిసె పంట ద్వారా వలిసె సాగు ... మిగతా 8వ పేజీలో


డుంబ్రిగుడ మండలం కించుమండకు సమీపంలో వేసిన వలిసె పంట


వలిసె పంటకు ప్రత్యామ్నాయంగా గిరిజనులు సాగు చేస్తున్న రాజ్‌మా పంట


పాడేరులో సోమవారం ఉదయం ముసురు వాతావరణం

మన్యంపై దిత్వా తుఫాన్ ప్రభావం

మధ్యాహ్నం వరకు దట్టంగా పొగమంచు

ఆ తరువాత మోస్తరు వర్షం

వరి రైతుల్లో ఆందోళన

రోజంతా ముసురు

- తాజా వాతావరణంతో జన జీవనానికి అంతరాయం

పాడేరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మన్యంపై ఆదివారం సాయంత్రం నుంచి దిత్వా తుఫాన్ ప్రభావం చూపుతున్నది. తమిళనాడు, రాయలసీమ ప్రాంతాల్లోనే తుఫాన్ ప్రభావం అధికంగా ఉంటుందని భావించినప్పటికీ ఏజెన్సీలోనూ ఒక మోస్తరు వర్షం కొనసాగుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సోమవారం సైతం ముసురు వాతావరణం కొనసాగుతూ మోస్తరు వర్షం కురిసింది.

తాజా తుఫాన్ ప్రభావంతో ఈదురుగాలులు, ఉరుములు, పిడుగులు వంటివి లేకపోవడంతో కాస్త ఊరట చెందారు. కానీ కొనసాగుతున్న వర్షానికి జనజీవనానికి మాత్రం తీవ్ర అంతరాయం ఏర్పడింది. కాగా ప్రస్తుతం వరి కోతలు, నూర్పుల సీజన్‌ కావడంతో రైతులు ఆయా పనుల్లో బిజీగా ఉన్నారు. ఈ క్రమంలో వర్షం కురిస్తే పంట నాశనమవుతుందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పలువురు రైతులు చాలా మేరకు పంటను కోసి సురక్షిత ప్రాంతాలకు తరలించగా, ఆలస్యంగా నాట్లు వేసిన రైతుల పంట ప్రస్తుతం కోసేసి పొలాల్లో ఉంచారు. తాజా వర్షాలకు ఆయా పంట దెబ్బతింటుందని ఆందోళన చెందుతున్నారు. ఇదే పరిస్థితి మరో రెండు మూడు రోజులు కొనసాగితే వరి పనలు తడిసిపోతాయని రైతులు అంటున్నారు.

తుఫాన్‌ నేపథ్యంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

దిత్వా తుఫాన్‌ ప్రభావంతో వాతావరణంలో మార్పుల కారణంగా మన్యంలో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. మూడు రోజుల క్రితం వరకు సింగిల్‌ డిజిట్‌లో ఉన్న కనిష్ఠ ఉష్ణోగ్రతలు, రెండు రోజులుగా డబుల్‌ డిజిట్‌కు చేరుకున్నాయి. ఉదయం వేళలో పొగమంచు సైతం సోమవారం తగ్గుముఖం పట్టింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జల్లులతో కూడిన వర్షం, ఆ తరువాత ఒక మోస్తరు వర్షం కురిసింది. మధ్యాహ్నం మూడు గంటల తరువాత జిల్లా కేంద్రం పాడేరును పొగమంచు కమ్మేసింది. దీంతో వాహనాలు లైట్ల వెలుతురులో రాకపోకలు సాగించాయి. సోమవారం హుకుంపేటలో 15.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా, పెదబయలులో 15.5, అరకులోయలో 15.6, డుంబ్రిగుడ, జి.మాడుగులలో 16.7, పాడేరులో 15.8, చింతపల్లిలో ... మిగతా 8వ పేజీలో


హుకుంపేటలో వర్షం


లంబసింగిలో మధ్యాహ్నం ఒంటి గంటకు కురుస్తున్న మంచు

తొలి రోజు 93.49 శాతం పింఛన్ల పంపిణీ

- జిల్లాలో మొత్తం 1,22,132 మందికి గాను 1,14,404 మందికి అందజేత


రంపచోడవరంలో పెన్షన్‌ పంపిణీలో పాల్గొన్న కలెక్టర్‌ దినేశ్‌కుమార్‌, తదితరులు

పాడేరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సామాజిక పింఛన్ల పంపిణీ ప్రక్రియలో భాగంగా తొలి రోజైన సోమవారం 93.49 శాతం మంది లబ్ధిదారులకు పెన్షన్‌ సొమ్మును అందించారు. జిల్లాలోని 22 మండలాల పరిధిలో మొత్తం 1,22,132 మంది పెన్షన్‌ లబ్ధిదారులకు రూ.51 కోట్ల 35 లక్షల 17 వేలు విడుదల కాగా, తొలి రోజు సోమవారం రాత్రి 8 గంటల సమయానికి 1,14,404 మందికి రూ.48 కోట్ల 62 వేల 500 పెన్షన్ల సొమ్మును అందించారు. ఇంకా 7,728 మందికి పెన్షన్‌ సొమ్ము అందించాల్సి ఉంది. దీంతో జిల్లాలో తొలి రోజు పెన్షన్ల పంపిణీ 93.49 శాతంగా నమోదైంది. తొలి రోజు పెన్షన్‌ పొందని లబ్ధిదారులకు మంగళవారం అందజేస్తామని అధికారులు పేర్కొన్నారు. జిల్లాలోని రంపచోడవరం డివిజన్‌ కేంద్రంలో పెన్షన్‌ పంపిణీలో కలెక్టర్‌ ఏఎస్‌ దినేశ్‌కుమార్‌, ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్‌, సబ్‌కలెక్టర్‌ శుభం నొక్వాల్‌, తదితరులు పాల్గొన్నారు. పాడేరు డివిజన్‌లోని అనంతగిరి మండలం కొండిభా, డముకు గ్రామాల్లో జీసీసీ చైర్మన్‌ కిడారి శ్రావణ్‌కుమార్‌, పాడేరు మండలం మినుములూరులో మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, డీఆర్‌డీఏ పీడీ వి.మురళి, పాడేరు పీఏసీఎస్‌ చైర్మన్‌ డప్పోడి వెంకటరమణ, కాడెలి గ్రామంలో జీసీసీ డైరెక్టర్‌ బొర్రా నాగరాజు, పలువురు కూటమి నేతలు ఆయా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

శత శాతం ధ్యేయం

సంపూర్ణ అక్షరాస్యత దిశగా కార్యాచరణ

- 2029 నాటికి సాధించడమే లక్ష్యం
- 2011 జనాభా లెక్కల మేరకు 66.91 శాతం అక్షరాస్యత
- ఉమ్మడి జిల్లాలో మొత్తం నిరక్షరాస్యులు ఆరు లక్షలు
- తొలివిడతలో 2.53 లక్షల మందిని తీర్చిదిద్దాలని కంకణం

విశాఖపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రతిఒక్కరూ అక్షరాస్యులు కావాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా 'అక్షర ఆంధ్ర' కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గత ఆర్థిక సంవత్సరం నుంచి 2026-27 వరకు మూడేళ్లలో నిరక్షరాస్యుల్లో మూడింట ఒక వంతు మందిని అక్షరాస్యులుగా మార్చాలన్నది లక్ష్యం. ఇందులో భాగంగా మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి శిక్షణ కార్యక్రమాలు పూర్తిచేసిన అధికారులు, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో నిరక్షరాస్యులకు చదవడం, రాయడం, కూడికలు, తీసివేతలు నేర్పించేందుకు తరగతులు నిర్వహిస్తున్నారు.

ఉమ్మడి విశాఖ జిల్లాలో 2011 జనాభా లెక్కల మేరకు అక్షరాస్యత 66.91 శాతం (పురుషులు 74.56, మహిళలు 59.34 శాతం)గా నమోదయింది. కొత్త జిల్లాల వారీగా చూస్తే విశాఖ జిల్లాలో పురుషులు, మహిళలు 84.81 శాతం, 73.21 శాతం (మొత్తం 79.05 శాతం), అనకాపల్లిలో 68.90, 52.43 (మొత్తం 60.55 శాతం), అల్లూరి జిల్లాలో 57.60, 39.53 (48.34 శాతం) అక్షరాస్యులున్నారు. ఆ తరువాత కాలంలో అక్షరాస్యత శాతం పెరిగింది. పదేళ్ల క్రితం సంక్షేమ కార్యక్రమాల అమలుకోసం చేపట్టిన సర్వే ప్రకారం ఉమ్మడి జిల్లాలో సుమారు ఆరు లక్షల మంది నిరక్షరాస్యులు ఉంటారని ... మిగతా 8వ పేజీలో


చదువుకుంటున్న నిరక్షరాస్యులు


నిరక్షరాస్యులకు పుస్తకాలు అందిస్తున్న వలంటీరు

ఏవోబీలో భద్రత కట్టుదిట్టం

- నేటి నుంచి మావోయిస్టు పీఎల్‌జీఏ వారోత్సవాల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తం
- సీలేరు మీదుగా తిరిగే ఆర్టీసీ నైట్‌ సర్వీసులు రద్దు


సీలేరులో సోమవారం రాత్రి వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసు బలగాలు

సీలేరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సీపీఐ మావోయిస్టుల ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం(పీఎల్‌జీఏ) వారోత్సవాలు ఈ నెల 2 నుంచి ప్రారంభంకానున్న నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. నిఘా వర్గాల హెచ్చరికతో ఆంధ్ర, ఒడిశా సరిహద్దుల్లో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ప్రతీ ఏటా డిసెంబరు 2 నుంచి 8వ తేదీ వరకు వారం రోజుల పాటు మావోయిస్టులు పీఎల్‌జీఏ పేరిట వారోత్సవాలను నిర్వహిస్తుంటారు. ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన మావోయిస్టులకు నివాళులర్పించడం, తమ ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తుంటారు. తాజాగా మారేడుమిల్లి ఎదురుకాల్పుల సంఘటనలో మావోయిస్టు అగ్ర నాయకుడు, కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మా, ఆయన భార్య రాజేతో సహా 13 మంది మావోయిస్టులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మావోయిస్టులు ప్రతీకార చర్యలకు పాల్పడే అవకాశాలున్నాయన్న నిఘా వర్గాల హెచ్చరికతో పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈ మేరకు ... మిగతా 8వ పేజీలో

డొంకరాయి నుంచి నీటి విడుదల నిలిపివేత

- పొల్లూరులో నిర్మించనున్న రెండు యూనిట్లకు వాటర్‌ కండక్టర్‌ సిస్టం ఏర్పాటు కోసం..
- పొల్లూరు, డొంకరాయిలో విద్యుదుత్పత్తికి బ్రేక్‌
- ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్సు చీఫ్‌ ఇంజనీర్‌ కేవీ రాజారావు

సీలేరు/మోతుగూడెం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): సీలేరు కాంప్లెక్సు పరిధిలోని పొల్లూరు జల విద్యుత్‌ కేంద్రానికి నీటిని సరఫరా చేసే డొంకరాయి పవర్‌ కెనాల్‌ నుంచి నీటి విడుదలను రెండు నెలల పాటు నిలిపివేస్తున్నట్టు సీలేరు కాంప్లెక్సు ఏపీ జెన్‌కో చీఫ్‌ ఇంజనీర్‌ కేవీ రాజారావు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పొల్లూరు జల విద్యుత్‌ కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న 115 మెగావాట్ల సామర్థ్యం (ఒక్కొక్కటి) గల 5, 6 రెండు యూనిట్లకు కమిషనింగ్‌ పనుల్లో భాగంగా ఆ రెండు యూనిట్లకు ఫోర్‌బే డ్యాం నుంచి పెన్‌స్టాక్‌ పైప్‌లైన్‌ ద్వారా నీరు పంపడానికి అవసరమైన వాటర్‌ కండక్టర్‌ సిస్టంను ఫోర్‌బే ఇంటెక్‌ వద్ద ఏర్పాటు చేయాలన్నారు. ఈ పనులు చేయాలంటూ డొంకరాయి పవర్‌ కెనాల్‌ నుంచి వచ్చే నీటి విడుదలను పూర్తిగా నిలిపివేయాలని ఆయన తెలిపారు. దీని కోసం డిసెంబరు 2 నుంచి రెండు నెలల పాటు నీరు నిలిపివేతకు ... మిగతా 8వ పేజీలో


ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్సు చీఫ్‌ ఇంజనీర్‌ కేవీ రాజారావు


డొంకరాయి పవర్‌ కెనాల్‌

విశాఖకు మణిహారం

- కైలాసగిరిపై గ్లాస్‌ బ్రిడ్జి ప్రారంభం
- సందర్శకులను అనుమతిస్తున్న అధికారులు

విశాఖపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగరానికి పర్యాటకంగా మరో మణిహారం అందుబాటులోకి వచ్చింది. కైలాసగిరిపై రూ.7 కోట్లతో నిర్మించిన గ్లాస్‌ బ్రిడ్జిని సోమవారం ప్రారంభించి సందర్శకులను అనుమతిస్తున్నారు. నాలుగు నెలల క్రితమే నిర్మాణం పూర్తిచేసుకున్న గ్లాస్‌ బ్రిడ్జిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతులు మీదుగా ప్రారంభించాలని భావించారు. అయితే ప్రతిసారీ కార్యక్రమం వాయిదా పడుతుండడంతో సోమవారం విశాఖ ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్‌తో ప్రారంభింపజేశారు. ఈ సందర్భంగా వీఎంఆర్‌డీఏ చైర్మన్‌ ప్రణవ్‌ గోపాల్‌ మాట్లాడుతూ కైలాసగిరిపై ఇప్పటికే స్కై సైక్లింగ్‌, పారా గ్లైడింగ్‌ అందుబాటులోకి వచ్చాయన్నారు. హుద్‌హుద్‌ వంటి భారీ తుఫాన్లను కూడా తట్టుకొని నిలబడేలా గ్లాస్‌ బ్రిడ్జి నిర్మించామన్నారు. త్వరలో కైలాసగిరిపై త్రిశూల్‌, ఢమరుకం నిర్మాణాలు పూర్తిచేస్తామన్నారు. చీకటి పడిన తరువాత నగర ప్రజలకు స్పష్టంగా కనిపించేలా లైటింగ్‌ ఏర్పాట్లు చేస్తామన్నారు. వీటన్నింటితో విశాఖకు పర్యాటక రంగంలో మరిన్ని పెట్టుబడులు లభిస్తాయని ఆశాభావం వ్యక్తంచేశారు. కైలాసగిరిని అత్యంత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, వీఎంఆర్‌డీఏ కమిషనర్‌ తేజ్‌ భరత్‌, జాయింట్‌ కమిషనర్‌ రమేశ్‌, చీఫ్‌ ఇంజనీర్‌ వినయ్‌కుమార్‌, ఈఈమధుసూదనరావు, నిర్వాహకులు పాల్గొన్నారు.


గ్లాస్‌ బ్రిడ్జి ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్‌, వీఎంఆర్‌డీఏ చైర్మన్‌ ప్రణవ్‌ గోపాల్‌, కమిషనర్‌ తేజ్‌భరత్‌, తదితరులు

దిత్వా తుఫాన్‌తో రైతుల్లో గుబులు

జి.మాడుగుల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్‌తో చిరుజల్లులు కురుస్తుండడంతో గిరిజన రైతులు ఆందోళన చెందుతున్నారు. మన్యంలో ఎటు చూసిన ముమ్మర వరి కోతలు సాగిస్తున్నారు. కొద్ది మంది కోతలు పూర్తి చేశారు. మరి కొందరు ప్రారంభించారు. ఈ పరిస్థితుల్లో తుఫాన్ నెలకొంది. అయితే వాతావరణ అధికారుల ముందుగానే సూచనలు చేసినప్పటికీ పండిన పంటను చూస్తు ఉండలేక చకచక పనులు చేపట్టారు. వర్ష ప్రభావానికి కోత దశకు చేరిన వరి పొలాలు, పనాలు మధ్యలో ఉన్న ధాన్యం తడిచి ముద్దవుతోంది. దీంతో రైతుల్లో దిక్కు తోచని పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉండగా ప్రస్తుతం ఏజెన్సీలో రాజ్‌మా పంట చివరి దశకు చేరుకుంది. ప్రస్తుతం కురిసే వర్షాలకు రాజ్‌మా పంట దెబ్బతినే అవకాశాలు ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఘనంగా గీతా జయంతి



భగవద్గీత పఠన పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

పాడేరురూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి శైవక్షేత్రం గిరి కైలాస మందిరంలో మహిళా ఆధ్యాత్మిక సేవా బృంద ధర్మకర్త కొట్టగుళ్లి రమాదేవి ఆధ్వర్యంలో సోమవారం గీతా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భగవద్గీతలో ఉన్న ప్రశాంత జీవన రహస్యమే గీతాసారం అన్నారు. అనంతరం చిన్నారులకు భగవద్గీత పఠనం పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ఉప్పల సీతారామశాస్త్రి, ప్రధాన కార్యదర్శి ఉప్పల వెంకటరత్నం, సిద్దినాతి కొండలరావు, మహిళా ఆధ్యాత్మిక సేవా బృంద సభ్యులు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, కాత్యాయని, కుమారి, నాగమణి, జయలక్ష్మి, మూర్తి, రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

జిల్లా భవన నిర్మాణ కార్మికుల సంఘం నూతన కార్యవర్గం

పాడేరురూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నట్టు ప్రైవేటు ఎలక్ట్రీషియన్, ప్లంబర్స్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు కొట్టగుళ్లి రామారావు తెలిపారు. కమిటీ నూతన జిల్లా అధ్యక్షుడుగా వరబోయిన రాంబాబు, ఉపాధ్యక్షుడుగా శ్రీశైలపు నానాజీ, ప్రధాన కార్యదర్శిగా చింత శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శిగా మల్లికార్జున, కోశాధికారిగా డి.రాజు, సహాయ కోశాధికారిగా ఏరికి రెడ్డి మధు, ముఖ్య కార్యవర్గ సభ్యులుగా కొమ్మోజు వెంకటరమణ, ఓలేసు బొంజుబాబు, దాసం వీరబాబు, ఆర్.వెంకటేష్, డి.రమణ, కొమ్ము సురేష్, మఠం స్వామిపాయుడు, వరప్రసాద్, వినోద్, బి.శ్రీనివాసరావు, బుజ్జి, కె.సన్యాసిరావు మరో 20 మందిని సభ్యులుగా ఎన్నుకున్నట్టు చెప్పారు.

డిప్యూటీ ఎంపీడీవోగా సన్యాసిరావు బాధ్యతల స్వీకరణ



సన్యాసిరావు(ఫైల్)

జి.మాడుగుల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో డిప్యూటీ ఎంపీడీవోగా ఎం.సన్యాసిరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎంపీడీవో ఎస్.డేవిడ్‌రాజు, ఎంపీపీ అప్పలరాజులను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రజలకు సేవలు అందేలా కృషి చేస్తానని సన్యాసిరావు స్పష్టం చేశారు.

డిజిటల్ మార్కెటింగ్‌పై సర్టిఫికెట్ కోర్సు

చింతపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):గిరిజన ప్రాంత యువతకు స్వయం ఉపాధి వృత్తి నైపుణ్యాలు పెంపొందించేందుకు కళాశాలలో డిజిటల్ మార్కెటింగ్ సర్టిఫికెట్ కోర్సును ప్రారంభిస్తున్నట్టు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయ భారతి అన్నారు. సోమవారం డిజిటల్ మార్కెటింగ్ సర్టిఫికెట్ కోర్సును ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పీఎం ఉష పథకంలో భాగంగా పాడేరు డిగ్రీ కళాశాల సౌజన్యంతో సర్టిఫికెట్ కోర్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 50 మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. కోర్సులో చేరిన విద్యార్థులకు హైదరాబాద్‌కి చెందిన రిసోర్స్‌పర్సన్ ఎల్. కృష్ణ కాంత్ తరగతులు బోధిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కోర్సు కన్వీనర్ నాగేంద్రబాబు పాల్గొన్నారు.

పేదల కళ్లల్లో ఆనందమే చంద్రబాబు లక్ష్యం

▸▸ జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్



పింఛన్ లబ్ధిదారులతో మాట్లాడుతున్న జీసీసీ చైర్మెన్ శ్రావణ్‌కుమార్

అనంతగిరి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పేదల కళ్లల్లో ఆనందం చూడడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ అన్నారు. మండలంలోని కొండిబ పంచాయతీ డముకు గ్రామంలో సోమవారం పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ హామీకి కట్టుబడి కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తున్నదన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిలు బాగోలేనప్పటికీ ప్రజలకు మంచిచేయాలనే తపనతో అనేక అవరోధాలను ఎదుర్కొంటూ ప్రభుత్వం నిలబడుతున్నదన్నారు. పేదల సేవలోని చంద్రబాబు ఉంటున్నారని, ప్రతీ కుటుంబాన్ని ఆర్థికంగా ఎదిగేలా కృషి చేస్తున్నారని చెప్పారు.

స్థానిక ఎన్నికల్లో విజయానికి పాటుపడాలి

స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా నాయకులు పనిచేయాలని జీసీసీ చైర్మన్ శ్రావణ్‌కుమార్ పిలుపునిచ్చారు. కొండిబ పంచాయతీ డముకు గ్రామంలో నాయకులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అభ్యర్థులు గెలుపునకు కృషిచేయాలని కోరారు. ప్రభుత్వం చేసిన మంచిని ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేసి ఓట్లు అడగాలని చెప్పారు. బూత్ కమిటీలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సోవేరి సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి గాలి నరేంద్ర, నాయకులు బుజ్జిబాబు, ఆనందరావు, నిర్మల, లక్ష్మణరావు, డి.శ్యామ్, జోగులు, ఎం.శ్యామ్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ హక్కులపై అవగాహన అవసరం

అనంతగిరి, డిసెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల హక్కులు, చట్టాలపై అవగాహన అవసరమని మానవ హక్కుల నేర నిరోధక సంఘం చైర్మెన, హైకోర్టు న్యాయవాది బోడ రాకేశ్‌నాయక్ పిలుపునిచ్చారు. మండలంలోని ఎగువశోభ పంచాయతీ మర్థగుడ గ్రామంలోని షాలేమ్ ప్రార్థన మందిరంలో సోమవారం ఆదివాసీ హక్కులపై సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యపై న్యాయపరంగా పోరాటం చేయాలని కోరారు. అనంతరం నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించారు. కమిటీ మండల అధ్యక్షుడిగా వంతాల రాజు, కార్యదర్శిగా చిట్టం రమేశ్, ఉపాధ్యక్షుడిగా సోమేల సోమేశ్, ఉప కార్యదర్శిగా పాంగి అప్పలస్వామి, ట్రెజరర్‌గా కొర్రా రాజు, సభ్యులుగా రమేశ్, కామేశ్, మోహన్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలోని రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కె.కృష్ణకుమారి, జిల్లా అధ్యక్షుడు కె.నగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు సైమన్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ 50 విద్యార్థులను టాపర్లుగా తీర్చిదిద్దాలి

▸▸ పాడేరు గిరిజన సంక్షేమ శాఖ డీడీ పరిమళ



డీడీ పరిమళను సన్మానిస్తున్న హెచ్‌డబ్ల్యూవోలు

చింతపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):సూపర్-50 విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో టాపర్లుగా నిలువాలని పాడేరు గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పీటీకే పరిమళ అన్నారు. సోమవారం సూపర్- 50 ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న గిరిజన సంక్షేమ శాఖ బాలూర, బాలికల ఆశ్రమ పాఠశాలలను ఆమె సందర్శించారు. తొలుత విద్యార్థుల విద్యా ప్రగతిని పరిశీలించారు. పాఠశాలలో అమలుచేస్తున్న మెనూ, విద్యార్థినీ, విద్యార్థులకు అందుబాటులోనున్న సదుపాయాలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ సూపర్ 50 విద్యార్థినీ, విద్యార్థులకు ప్రత్యేక ఉపాధ్యాయులతో బోధన నిర్వహిస్తున్నామన్నారు. ఇందులోని ప్రతి విద్యార్థి పది పరీక్షల్లో 95 శాతానికి మించి మార్కులు సాధించాలన్నారు. సూపర్ 50 విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అలాగే ఆశ్రమ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న పదో తరగతి విద్యార్థులందరూ శతశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఒక్కరూ ఫెయిల్ కావడానికి వీలులేదన్నారు. వెనుకబడిన విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. విద్యార్థుల్లో అనారోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే ఆస్పత్రికి తీసుకొని వెళ్లి మెరుగైన చికిత్స అందించాలన్నారు. అవసరమైతే మైదాన ప్రాంతాలకు తరలించాలన్నారు. మెనూ పాటించకపోతే శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం డీడీగా బాధ్యతలు స్వీకరించి తొలిసారిగా చింతపల్లి రావడంతో స్థానిక హెచ్‌డబ్ల్యూవోలు ఆమెను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పీజీహెచ్‌ఎంలు బీఎస్ఎన్ రాజు, సాగిన రామరాజు పడాల్, హెచ్‌డబ్ల్యూవోలు ఎం.నూకరత్నం, యూ. గణేశ్వరరావు, జి. తిరుపతిరావు, సీహెచ్. శ్రీనివాసరావు, కె. పద్మవతి, వి.కృష్ణబాబు పాల్గొన్నారు.

పింఛన్లు పేదలకు కొండంత అండ

▸▸ టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి



మినుములూరులో పింఛన్‌లు పంపిణీ చేస్తున్న గిడ్డి ఈశ్వరి, తదితరులు

పాడేరురూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పేద కుటుంబాలకు పింఛనే కొంతంత అండగా నిలుస్తుందని టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి అన్నారు. సోమవారం మండలంలోని మినుములూరులో పింఛన్లను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అందిస్తున్న పింఛన్‌లతో పేదల కుటుంబాల్లో సంతోషాలు వెల్లివిరుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లంకెల చిట్టమ్మ, టీడీపీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు బొర్రా విజయరాణి, పాడేరు పీఏసీఎస్ చైర్‌పర్సన్ డప్పోడి వెంకటరమణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ దాగరి సుమతి, బుద్ద జ్యోతికిరణ్, అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డిప్పల వెంకటకుమారి, తెలుగు యువత మండల అధ్యక్షుడు దుంబేరి రమణబాబు, డీఆర్‌డీఏ పీడీ వి.మురళి, డిప్యూటీ ఎంపీడీవో ఆర్‌వీఎస్.రమేష్, డీపీఎం మార్టిన్, వెలుగు ఏపీఎం చిన్నారావు పాల్గొన్నారు. కిండంగిలో పింఛన్లను జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, సచివాలయ సెక్రటరీ అమృత పాల్గొన్నారు. పాడేరు పీఏసీఎస్ చైర్‌పర్సన్ డప్పోడి వెంకటరమణ సచివాలయ సిబ్బందితో కలిసి వర్తనపల్లిలో పింఛన్‌ల పంపిణీ చేశారు. తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోడా వెంకట సురేష్‌కుమార్ డోకులూరు పంచాయతీ దుమ్మాపుట్టు, వల్లాపురం గ్రామాల్లో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు టి.వెంకట ప్రసాద్, టి.మూర్తిబాబు, ధర్మారావు, సీదరి నాగరాజు, మజ్జి మత్స్యరాజు, సీదరి మత్స్యరాజు, మజ్జి సూరిబాబు, సోమేష్ కుమార్ పాల్గొన్నారు.

ఎయిడ్స్ బాధితులకు పౌష్టికాహారమే కీలకం

▸▸ ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హేమలతాదేవి



ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, రాజకీయ నాయకులు, సిబ్బంది

పాడేరురూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ, ఎయిడ్స్ బాధితులు ఆరోగ్యవంతంగా ఉండేందుకు పౌష్టికాహారం అత్యంత కీలకమని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.హేమలతాదేవి అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా స్థానిక కాఫీహౌస్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గర్భిణులు విధిగా హెచ్ఐవీ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ సందర్భంగా హెచ్ఐవీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవీ బాధిత చిన్నారులకు దుప్పట్లు, టవల్స్, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న బాధితులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. జిల్లా ఎయిడ్స్ అధికారి డాక్టర్.ఎం.కిరణ్‌కుమార్ బాధితులకు పలు సూచనలు అందించారు. అనంతరం డీఎంహెచ్‌వో డాక్టర్.డి.కృష్ణమూర్తి నాయక్ ఆధ్వర్యంలో ఐటీడీఏ నుంచి కాఫీహౌస్ వరకు అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏడీఎంహెచ్‌వో డాక్టర్.ప్రతాప్, డాక్టర్. సంధ్య తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ ఎయిడ్స్ అవగాహన ర్యాలీని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.వనుము చిట్టబ్బాయి ప్రారంభించారు. అక్కడ మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ టీఎన్.రసూల్, ఆర్ఆర్‌సీ కో-ఆర్డినేటర్ జి.దామోదరరావు, ఎన్ఎస్ఎస్ జిల్లాఆఫీసర్ జి.గౌరీశంకరరావు, ఎన్ఎస్ఎస్ పీవోలు వి.రమేష్‌బాబు, పి.జానకీరావు పాల్గొన్నారు.

కొయ్యూరులో..

మండలంలోని డౌనూరు, రాజేంద్రపాలెం, యు.చీడిపాలెంల్లో ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా అవగాహన ర్యాలీలు నిర్వహించారు. అనంతరం మానవహారాలుగా ఏర్పడి ఎయిడ్స్ దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డౌనూరు, రాజేంద్రపాలెం, యు. చీడిపాలెం వైద్యాధికారులు, పీహెచ్‌సీల సిబ్బంది పాల్గొన్నారు.

జి.మాడుగులలో..

హెచ్ఐవీకి ఎవరూ గురికాకుడదని స్థానిక వైద్యాధికారిని ఇందిరా అన్నారు. సోమవారం ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో ఎయిడ్స్ బాధితులకు వివక్ష చూపకూడదన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి ఎన్.ప్రకాశ్, సిబ్బంది మేనక, మంగమ్మ, గాయత్రి, కొత్తందొర, బాలయ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీలేరులో..



హుకుంపేట: హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై నినాదాలు చేస్తున్న వైద్య సిబ్బంది

జీకేవీధి మండలం ధారకొండలో సోమవారం పీహెచ్‌సీ వైద్యాధికారి బాబ్జి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఎయిడ్స్ పై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఎయిడ్స్ బాధితులకు సామాజిక మద్దతు అందించాలన్నారు.

అరకులోయలో...

అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా హెచ్ఐవీపై అవగాహన కోసం వారు నినాదాలు చేశారు. ర్యాలీలో ప్రిన్సిపాల్ డాక్టర్ భరత్‌కుమార్ నాయక్, వైస్ ప్రిన్సిపాల్, రెడ్‌రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.కొండబాబు, ఎన్ఎస్ఎస్ పీవోలు విజయలక్ష్మి, అనితకుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టులో...

మండల కేంద్రంలో హెచ్ఐవీపై వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌సీ నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు వివిధ నినాదాలతో ర్యాలీ సాగించారు. అనంతరం అక్కడ మానవహారంగా నిలబడి ఎయిడ్స్‌పై బారిన పడకుండా తీసుకోవలని జాగ్రత్తలను వివరించారు. ఎయిడ్స్‌పై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కిలగాడ పీహెచ్‌సీ వైద్యాధికారి నిఖిల్ సూచించారు. వైద్య సిబ్బంది సౌరప్పడు, వెంకట్రావు పాల్గొన్నారు.

డుంబ్రిగుడలో...

డుంబ్రిగుడ జాతీయ రహదారిపై ఎయిడ్స్ నివారణ దినం పురస్కరించుకుని వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. వైద్యులు రాంబాబు, అంబిక ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో విద్యార్థులు, వైద్య సిబ్బంది పాల్గొని నినాదాలు చేశారు. హెచ్ఐవీ పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచించారు. సుఖ వ్యాధులు ఉంటే వైద్యులను సంప్రదించాలని వారు చెప్పారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది లవరాజు, సంజీవరావు, తదితరులు పాల్గొన్నారు.

పెదబయలులో...

గోమంగి గ్రామంలో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చైతన్య మాట్లాడుతూ లైంగిక అంశాలపై జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా హెచ్ఐవీ నుంచి తప్పించుకోవచ్చన్నారు. సురక్షితమైన లైంగిక సంబంధాలతో వ్యాధి బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చని సూచించారు.

హుకుంపేటలో...

మండలంలోని ఉప్ప పీహెచ్‌సీ సిబ్బంది హెచ్ఐవీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య కేంద్రం నుంచి ఉప్ప గ్రామం వరకు ఈ ర్యాలీ సాగించారు. ర్యాలీలో జీజే కళాశాల విద్యార్థులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలో భూముల పరిశీలన

అనంతగిరి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాన్ షెడ్యూల్ పంచాయతీల్లో ఆర్డీవో లోకేశ్వరరావు సోమవారం సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా భీంపోల్ పంచాయతీ నందకోట రెవెన్యూ పరిధిలోని 22ఏ తమ భూమి ఉందని, దాని నుంచి మినహాయించాలని భూ యాజమానులు దరఖాస్తు చేయగా.. దానిపై క్షేత్రస్థాయిలో విచారణ చేసేందుకు వచ్చారు. అక్కడ నుంచి భీమవరం గ్రామ పరిధిలోని ఓ భూ యాజమాని తమ భూమికి సంబంధించి రికార్డుల పరంగా హక్కులు కల్పించాలని, ఆర్వోఆర్ అపీల్ చేయగా విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా రెవెన్యూ సిబ్బంది తగిన చర్యలు చేపట్టాలని చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వీరభద్రచారి, వీఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.

వేతనాల కోసం హమాలీల ఆందోళన

గూడెంకొత్తవీధి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రెండు నెలల బకాయి వేతనాలు పౌరసరఫరాల శాఖ విడుదల చేయాలని హమాలీలు ఆందోళన చేశారు. సోమవారం స్థానిక ఎంఎల్ఎస్ గోదాము వద్ద హమాలీలు ఆందోళన చేశారు. ఈసందర్భంగా హమాలీలు మాట్లాడుతూ అక్టోబరు, నవంబరు జీతాలు నేటికి విడుదల చేయలేదన్నారు. వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామన్నారు. పౌరసరఫరాల శాఖ వెంటనే వేతనాలు మంజూరు చేయాలని, లేకుంటే సమ్మె చేపడతామన్నారు.

జి.మాడుగులలో..

తమ రెండు నెలల వేతనాలు చెల్లించాలని జీసీసీ హమాలీలు సోమవారం ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద ఆందోళన చేపట్టారు. సోమవారం వారు విధులు బహిష్కరించారు. రెండు నెలల వేతనాలు మంజూరులో జీసీసీ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుమని వారు వాపోయారు. అధికారులు స్పందించి వేతనాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో సత్తిబాబు, బాబూరావు, శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలోనే అత్యధిక పింఛన్లు

▸▸ ఆర్టీసీ జోన్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర



కించుమండ గ్రామంలో పింఛన్లను పంపిణీ చేస్తున్న దొన్నుదొర

డుంబ్రిగుడ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలోనే అత్యధిక పింఛన్ల పంపిణీ జరుగుతున్నదని ఆర్టీసీ జోన్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర అన్నారు. మండలంలోని కించుమండ పంచాయతీ కేంద్రంలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఇంటింటికీ వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పింఛన్ల మొత్తం పెంపుతో పాటు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. మన్యంలో కోట్లాది రూపాయల నిధులతో డోలీ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుతుందన్నారు. శరవేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. గత ప్రభుత్వం అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పింఛన్లు అన్నదాత సుఖీభవ అందించడం కూటమి ప్రభుత్వానికి సాధ్యపడిందన్నారు. అరకు పార్లమెంట్ నియోజకవర్గ కోశాధికారి వంతల నాగేశ్వరరావు, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ సుబ్బారావు, జనసేన మండల అధ్యక్షుడు దన్నేశ్వరరావు, టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి స్వామి, మండల ప్రధాన కార్యదర్శి మల్లికార్జునరావు, నాయకులు భీమరాజు, భాస్కరరావు పాల్గొన్నారు.

సీలేరు కాంప్లెక్సులో ఇద్దరు ఎస్ఈల నియామకం

▸▸ సివిల్ ఎస్ఈగా షేక్ జాకీర్‌హుస్సేన్

▸▸ పంప్డ్‌స్టోరేజీ ఎస్ఈగా సి. హనుమ

సీలేరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్సు సూపరింటెండెంట్ ఇంజనీర్ (సివిల్)గా షేక్ జాకీర్ హుస్సేన్, పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా హనుమలను నియమిస్తూ జెన్‌కో ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. సీలేరు కాంప్లెక్సు సివిల్ ఓఅండ్ఎం ఇన్‌చార్జి ఎస్ఈగా,పంప్డ్ స్టోరేజీ ఎస్ఈగా రెండేళ్లుగా విధులు నిర్వహిస్తున్న బి.చంద్రశేఖర్‌రెడ్డి రిటైరు కావడంతో కృష్ణపట్నం థర్మల్ పవర్ ప్రాజెక్టులో ఈఈగా విధులు నిర్వహిస్తున్న షేక్ జాకీర్‌హుస్సేన్‌కు పదోన్నతి కల్పించి ఇక్కడ ఎస్ఈగా నియమించారు. అలాగే పోలవరం ప్రాజెక్టులో ఈఈగా విధులు నిర్వహిస్తున్న సి.హనుమకు ఎస్ఈగా పదోన్నతి కల్పించి సీలేరు పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు ఎస్ఈగా నియమిస్తూ జెన్‌కో ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. వారు విధుల్లో చేరేంత వరకు సీలేరు కాంప్లెక్సు ఓఅండ్ఎం ఎస్ఈ చిన్నకామేశ్వరావుకు సివిల్ ఎస్ఈ, పంప్డ్‌స్టోరేజీ ఎస్ఈ ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు.

'పథకాలను సద్వినియోగం చేసుకోవాలి'



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న భాస్కరరావు

పాడేరురూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహిత విద్యా కో-ఆర్డినేటర్ భాస్కరరావు అన్నారు. ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సమగ్ర శిక్ష, పారా స్పోర్ట్సు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తలారిసింగి పాఠశాల ప్రాంగణంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఏర్పాటు చేసిన క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలకు ప్రత్యేక శిబిరాల ద్వారా ఉపకరణాలు అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో జగన్మోహనరావు, పారా స్పోర్ట్స్ టెక్నికల్ ఆఫీసర్లు కె.సంతోష్, పి.రాజేష్, భవిత కేంద్రాల ఐఈఆర్పీలు, సమగ్ర శిక్ష సిబ్బంది, సీడబ్ల్యూఎస్ఎన్‌లు పాల్గొన్నారు.

జీసీసీ బ్రాంచి మేనేజర్‌గా రాజుబాబు



రాజుబాబు(ఫైల్)

గూడెంకొత్తవీధి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిరిజన సహకార సంస్థ బ్రాంచి మేనేజర్‌గా కుడుముల రాజుబాబు నియమితులయ్యారు. ఏడాది పాటు స్థానిక బ్రాంచి మేనేజర్ పోస్టు ఖాళీగా వుండడంతో కొయ్యూరు బ్రాంచి మేనేజర్ సరమండ విజయకుమార్‌కి అదనపు బాధ్యతలు అప్పగించారు. తాజాగా స్థానిక అకౌంటెంట్ రాజుబాబుకి మేనేజర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జీసీసీ ఎండీ ఉత్తర్వులు జారీచేశారు. ఈమేరకు మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.అకౌంటెంట్‌గా కొండబాబు నియమితులయ్యారు.

కిశోర బాలికలు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి : ఎంపీడీవో

చింతపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్థానిక ఎంపీడీవో సీహెచ్ సీతామహలక్ష్మి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వాసవ్య మహిళా మండలి కిశోర బాలికలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంపీడీవో మాట్లాడుతూ కిశోర బాలికలు విద్యలో రాణించాలన్నారు. కిశోర బాలికలు అపరిచిత వ్యక్తులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కిశోర బాలికలకు మంచి స్పర్శ, చెడు స్పర్శపై చైతన్యవంతులు కావాలన్నారు. లైంగిక వేధింపులు ఎదురైతే సమీపంలోనున్న అంగన్‌వాడీ కార్యకర్త, మహిళా కానిస్టేబుల్, ఐసీడీఎస్ ఉద్యోగుల సహాయం పొందాలన్నారు. కార్యక్రమంలో సీడీపీవో శీదేవి, వాసవ్య మహిళా మండలి ప్రాజెక్టు డైరెక్టర్ సునీత పాల్గొన్నారు.

నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

అధ్యక్ష, కార్యదర్శులుగా సింహాచలం, ఫాలు




అధ్యక్ష, కార్యదర్శులు సింహాచలం.. ఫాలు

అరకులోయ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం నోబుల్ టీచర్స్ అసోసియేషన్ అల్లూరి జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. అనకాపల్లి జిల్లా అధ్యక్షులు తుంపాల వెంకటరమణ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా బోయిపల్లి సింహాచలం, ప్రధాన కార్యదర్శిగా మండ్యకేది ఫాలు, గౌరవ అధ్యక్షుడిగా మాదల బుజ్జిబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు 24 మంది సభ్యులను ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ ప్రతినిధులను ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర అభినందించారు. విద్యా ప్రగతికి కృషి చేయాలని వారికి సూచించారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి : ఏవో

ముంచంగిపుట్టు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో గిరిజన రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏవో మురళీ కృష్ణ సూచించారు. బంగారుమెట్ట పంచాయతీ రైతు సేవా కేంద్రం పరిధిలోని పలు గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించి వరి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ నేపథ్యంలో వర్షాలు కురిసే అవకాశం ఉందని, దీనివల్ల చేతి కొచ్చిన దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. వరి పంటను తుఫాన్ ప్రభావం తగ్గే వరకు కోయకూడదని సూచించారు. ఇప్పటికే కోత కోసిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాల్లో భద్రపరచాలని, పొలాల్లో కుప్పలుగా ఉంచరాదని ఆయన చెప్పారు.

గ్రామాల్లో దశల వారీగా సదుపాయాలు

ముంచంగిపుట్టు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో జర్జుల పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాల్లో దశలవారీగా మౌలిక సదుపాయాల కల్పనకు తనవంతు కృషి చేస్తానని పంచాయతీ సర్పంచ్ డి.పోర్ణిమా చెప్పారు. అమలగూడ గ్రామంలో సీసీ రోడ్డు పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.4.35 లక్షలు వెచ్చించి సీసీ రోడుడ నిర్మాణ పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. సీసీ రోడ్డు లేక వర్షాకాలంలో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారని, ఆ విషయాన్ని తన దృష్టికి తీసుకురావడంతో నిధులు మంజూరు చేయడం జరిగిందని ఆమె చెప్పారు.

పాఠశాలలను సందర్శించిన ఎంఈవో

ముంచంగిపుట్టు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదగూడ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో గల టొంగికోట, పెదగూడ, గొడుగులపుట్టు, సారధి, గలగండ, జర్రిపడ, గత్తుమాలడ, బాకుబేడ తదితర పాఠశాలలను మండల విద్యా శాఖాధికారి సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీలు చేశారు. అలాగే విద్యార్థుల ప్రగతి, టీఏఆర్ఎల్, ఎఫ్ఎల్ఏ అమలు తీరుపై తనిఖీలు నిర్వహించారు. విద్యా బోధనకు సంబంధించి ఉపాధ్యాయులకు పలు సూచనలను ఇచ్చారు. విద్యార్థులకు పలు ప్రశ్నలను వేసి వారి నుంచి జవాబులను రాబట్టారు. అలాగే ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ ప్రాథమిక స్థాయి నుంచే క్రమ శిక్షణతో చదువుకోవాలని విద్యార్థులకు ఆయన సూచించారు.


కొత్తకోటలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజు

సమర్ధ పాలన చంద్రబాబుకే సాధ్యం

▸▸ చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

రావికమతం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని సమర్ధవంతంగా పరిపాలించే సత్తా చంద్రబాబునాయుడుకే సాధ్యమని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు పేర్కొన్నారు. సోమవారం కొత్తకోటలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో భాగంగా సూపర్ సిక్స్ పథకాల అమలుతో పాటు ఊహించని ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు అందిస్తున్నారన్నారు. ఇప్పటికే కొత్తకోట రింగ్ రోడ్డు పనులు దాదాపు పూర్తయ్యాయని, త్వరలోనే బీఎన్ రోడ్డు నిర్మాణం చేపడతామని చెప్పారు. అలాగే బీఎన్ రోడ్డు పరిధిలో కూలిపోయిన విజయరామరాజు, వడ్డాది వంతెనల నిర్మాణానికి త్వరలోనే టెండర్లు ఖరారు కానున్నాయన్నారు. ఆర్ఈసీ రోడ్డు అభివృద్ధికి సీఎం చంద్రబాబు, ఆర్అండ్‌బీ శాఖ మంత్రి, ఉన్నతాధికారులను కలసి రూ.12.5 కోట్లు మంజూరు చేయించినట్టు ఎమ్మెల్యే చెప్పారు. ఈ నిధులతో రావికమతం నుంచి గుడ్డిప వరకు రోడ్డు నిర్మాణం జరుగుతున్నదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహేశ్, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ రాజాన కొండనాయుడు, తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు కె.నీలవేణి, టీడీపీ సీనియర్ నేత కోట గోవిందరావు పాల్గొన్నారు.

ప్రజలతో మమేకమై పనిచేయండి: డీఎస్పీ


మహిళా కానిస్టేబుల్‌కు రివార్డు అందిస్తున్న నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు

నాతవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పోలీసులు ప్రజలతో మరింత మమేకమై పనిచేయాలని నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు సూచించారు. నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మతో కలిసి నాతవరం పోలీసు స్టేషన్‌ను ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. అనంతరం విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన మహిళా కానిస్టేబుల్ రాజేశ్వరికి రివార్డును అందజేశారు. పోలీసు స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని సూచించారు. అలాగే గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వై.తారకేశ్వరరావు పాల్గొన్నారు.

గంటాకు కూటమి నేతల శుభాకాంక్షలు


గంటాకు జ్ఞాపిక అందిస్తున్న చోడవరం జనసేన, టీడీపీ నాయకులు

చోడవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): భీమిలి ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు జన్మదిన వేడుకల్లో కూటమి నాయకులు పాల్గొని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చోడవరానికి చెందిన జనసేన జిల్లా కార్యదర్శి సిరిపురపు రమేశ్, పీఏసీఎస్ చైర్మన్ గూనూరు మూలినాయుడు, జనసేన పట్టణ అధ్యక్షుడు కర్రి రమేశ్, పార్టీ నేత బొబ్బిలి నాయుడు, లక్కవరం, జన్నవరం టీడీపీ నాయకులు సేనాపతి శ్రీనివాసరావు, ఎస్.నరసింహమూర్తి పాల్గొన్నారు.

టీడీపీని మరింత బలోపేతం చేయాలి


మండల నాయకులతో చర్చిస్తున్న పార్టీ పరిశీలకుడు చిట్టిబాబు

నాతవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో టీడీపీని మరింత బలోపేతం చేయాలని పార్టీ పరిశీలకులు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పెద్దిరెడ్ల చిట్టిబాబు కోరారు. డి.యర్రవరంలో పార్టీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, తాండవ చైర్మన్ కరక సత్యనారాయణలతో కలిసి నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గత ఎన్నికల్లో టీడీపీకి ఓట్లు తక్కువ వచ్చిన బూత్‌లపై చర్చించారు. ఆయా ప్రాంతాల్లో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ పల్లా విజయ్‌కుమార్, డి.యర్రవరం సర్పంచ్ సత్యవతి పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సోషల్ ఆడిట్


నాగాపురంలో ఉపాధి పనులపై సోషల్ ఆడిట్ చేస్తున్న అధికారులు

కృష్ణాదేవిపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని సిహెచ్.నాగాపురం గ్రామంలో ఉపాధి పథకంపై సోమవారం సోషల్ ఆడిట్ చేశారు. పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ ప్రజల సమక్షంలో వివిధ పనులపై గ్రామసభ నిర్వహించారు. వ్యయాలు, లబ్ధిదారుల వివరాలు, బిల్లులు, మస్టర్లు తదితర అంశాలను అధికారులు పరిశీలించారు. ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులు నిజమైన లబ్ధిదారులకు చేరాలని ఈ సందర్భంగా సర్పంచ్ వైఆర్.చంద్రరావు కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ టీసీ సిహెచ్.రాధిక, కార్యదర్శి అశోక్, మాజీ సర్పంచ్ కొలగాని రామారావు, టీడీపీ నాయకులు బొప్పన ప్రసాద్, వరహాలుబాబు తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేల శిబిరంపై పోలీసుల దాడి

బుచ్చెయ్యపేట, డిసెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిబ్బిడి గ్రామంలో సోమవారం కోడి పందేల శిబిరంపై పోలీసులు మెరుపు దాడి చేశారు. ఈ దాడుల్లో పది మంది కోడి పందెం రాయుళ్లు పట్టుబడ్డారు. వారి నుంచి 5,040 నగదు, మూడు కోళ్లు, తొమ్మిది ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని, పందెంరాయుళ్లను అరెస్టు చేశామని ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

రైతుల మేలు కోసం ప్రభుత్వం కృషి

మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

ఒమ్మలిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

మాడుగుల రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రైతులకు మేలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి అన్నారు. మండలంలోని ఒమ్మలి రైతు సేవా కేంద్రంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళారుల చేతుల్లో రైతులు మోసపోకుండా సరైన గిట్టుబాటు ధర కల్పించేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ కేంద్రాల ద్వారా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి, సకాలంలో వారి బ్యాంకు ఖాతాల్లో సొమ్ము జమ చేస్తారన్నారు. గ్రేడ్-ఎ రకానికి క్వింటాకు రూ.2389, సాధారణ రకానికి రూ.2369 ధర నిర్ణయించారని ఆయన చెప్పారు. రైతులకు వెన్నుదన్నుగా ఉండేందుకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, సర్పంచ్ సింహాచలంనాయుడు, టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు నందారపు సన్యాసిరావు, రమేశ్, నాయకులు ఉండూరు దేముడు, పెంటకోట జగన్నాథరావు, చారుమతిదేవి, ఏవో అనసూయ, వ్యవసాయ సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

చంద్రబాబుకు రాష్ట్ర అభివృద్ధే ప్రధానం

కె.కోటపాడు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధే ప్రధాన ధ్యేయంగా సీఎం చంద్రబాబు పనిచేస్తున్నారని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. సూరెడ్డిపాలెం గ్రామంలో సోమవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్రాన్ని దారుణంగా లూటీ చేసి వందేళ్లు వెనక్కి తీసుకువెళ్లిందన్నారు. వైకాపా నాయకులు దోపిడీలు, దౌర్జన్యం, అవినీతి ప్రధాన అస్త్రాలుగా పరిపాలన చేశారన్నారు. ప్రస్తుతం చంద్రబాబు పాలనపై అన్ని వర్గాల వారు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. గ్రామాల్లో కార్యకర్తలు ఎప్పటికప్పుడు రచ్చబండలు వద్ద ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సాంబశివరావు, తహశీల్దార్ భుజంగరావు, రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ ఈవీజీ కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు రొంగలి మహేశ్, నాయకులు ఈర్లె మల్లు నాయుడు, గంగునాయుడు, బాబ్జి, ఎరుకునాయుడు, డి.నరసింహ మూర్తి, పి.శ్రీను, సిహెచ్.రామారావు, జె.రాము, కె.సూర్యనారాయణ, అప్పలనాయుడు, కె.అంజిబాబు, నారాయణమూర్తి, శ్రీను పాల్గొన్నారు.


సూరెడ్డిపాలెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు, పక్కన పీవీజీ కుమార్

పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

మునిసిపల్ కౌన్సిలర్ పద్మావతి... ఉత్సాహంగా పింఛన్ల పంపిణీ

నర్సీపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని 26వ వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి అన్నారు. సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఉత్సాహంగా పంపిణీ చేశారు. నర్సీపట్నంలో కౌన్సిలర్ పద్మావతి గడప గడపకు వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు కృషి ఫలితంగా మునిసిపాలిటీలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో నూకాలమ్మ ఆలయ కమిటీ ప్రతినిధులు కొరుప్రోలు శ్రీనివాసరావు, బాల పాల్గొన్నారు.

మాకవరపాలెంలో...

మాకవరపాలెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చామంతిపురం, శెట్టిపాలెం గ్రామాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్‌వై.పాత్రుడు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు అల్లు రామునాయుడు సోమవారం పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులందరికీ పింఛన్ అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలు ఆర్.రమణమ్మ, నాయకులు అప్పలరాజు, శివ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండలో...

గొలుగొండ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో పింఛన్లు పంపిణీ చేశారు. నూతనంగా తొమ్మిది పింఛన్లు మంజూరైనట్టు ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. గుండుపాలలో టీడీపీ మండల అధ్యక్షుడు చిటికెల తారక వేణుగోపాల్ పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పింఛన్ల మంజూరులో ముందుంటుందన్నారు.

రోలుగుంటలో...

రోలుగుంట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని పంచాయతీల్లో పింఛన్ల పంపిణీని ఉత్సాహంగా నిర్వహించారు. రోలుగుంటలో ఎంపీడీవో నాగేశ్వరరావు పాల్గొని పంపిణీ చేశారు. మొదటి రోజే 90 శాతం మేర పంపిణీ పూర్తి చేసినట్టు ఆయన తెలిపారు. లబ్ధిదారులకు సేవలను మరింత వేగంగా, పారదర్శకంగా అందించేందుకు సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు.


నర్సీపట్నంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ పద్మావతి

బుచ్చెయ్యపేటలో...

బుచ్చెయ్యపేట, డిసెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): మండలానికి 15 కొత్త పింఛన్లు మంజూరయ్యాయని ఎంపీడీవో శివప్రసాద్ నారాయణరావు తెలిపారు. సోమవారం నీలకంఠపురంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ ఏశారు. డిసెంబర్ నెలకు 10532 మంది లబ్ధిదారులకు రూ.4.6 కోట్లు విడుదలయ్యాయని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. సోమవారం మధ్యాహ్నం వరకు 95 శాతం మందికి పింఛన్లు అందించామన్నారు. ఈ నెల మండలానికి 15 స్పౌజ్ పింఛన్లు, మాత్రపిండాల వ్యాధిగ్రస్థులకు పింఛన్లు మంజూరయ్యాయని ఆయన చెప్పారు.

మాడుగుల రూరల్...

మాడుగుల రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొంగలిపాక గ్రామంలో పీఏసీఎస్ అధ్యక్షులు ఉండూరు దేముడు, నాయని సత్యనారాయణ, కూటమి నాయకులు సోమవారం పింఛన్లు పంపిణీ చేశారు. అర్హులందరికీ పింఛన్ల పంపిణీ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు గురించి వారు వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, సచివాలయం ఉద్యోగులు, నాయకులు నాయుడు, సత్యం, పోతురాజు, తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీలు

చోడవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై సోమవారం అవగాహన ర్యాలీలు చేశారు. అలాగే నాలుగు రోడ్ల కూడళ్లలో మానవహారాలు నిర్వహించారు. చోడవరం ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రి ఐసీటీసీ కేంద్రం ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎయిడ్స్‌పై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేలకు ఎమ్మెల్యే బహుమతులు అందించారు. అనంతరం కొత్తూరు జంక్షన్ వరకూ ర్యాలీగా వెళ్లి, అక్కడ మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ దినేశ్‌కుమార్, అభివృద్ధి కమిటీ చైర్మన్ దేవరపల్లి వెంకట అప్పారావు, సర్పంచ్ నూకరత్నం, టీడీపీ నాయకులు సకురు కోటేశ్వరరావు, మల్లిబాబు, డాక్టర్లు నాగభూషణం, విష్ణుప్రియ, రవికుమార్, ఐసీటీసీ కౌన్సెలర్ ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రావికమతం: మండలంలోని కొత్తకోట పీహెచ్‌సీ వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాధికి నివారణ ఒకటే మార్గమని ఈ సందర్భంగా డాక్టర్ సురేఖ చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి పి.రామారావు, హెచ్‌వి ఎర్రయ్యమ్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రోలుగుంట: స్థానిక జూనియర్ కళాశాల విద్యార్థులు నినాదాలతో ర్యాలీ చేశారు. హెచ్ఐవీ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాధితులకు అందిస్తున్న వైద్య సేవలను వారు వివరించారు. అనంతరం బీఎన్ రోడ్డుపై మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అప్పలరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మాడుగుల: స్థానిక డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం, రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ఎయిడ్స్ నివారణ దినోత్సవం నిర్వహించారు. యువత ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ నాయుడు సూచించారు. అనంతరం బస్టాండ్ ఆవరణలో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. కార్యక్రయంలో కళాశాల ప్రిన్సిపాల్ సీవీఎస్ఎస్ శాస్త్రి, జి.జయలక్ష్మి, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.


కె.కోటపాడు ప్రధాన కూడలిలో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు



చోడవరంలో ర్యాలీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

కె.కోటపాడు: అయ్యన్న డిగ్రీ, వివేకానంద జూనియర్ కళాశాల విద్యార్థులు హెచ్ఐవీపై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని డాక్టర్ శ్రీలక్ష్మి ప్రారంభించారు. ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉంటే వ్యాధులకు దూరంగా ఉండవచ్చని ఈ సందర్భంగా డాక్టర్ శ్రీలక్ష్మి చెప్పారు. అనంతరం కె.కోటపాడు పుర వీధులలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు కోటేశ్వరరావు, సంతోశ్‌కుమార్, విజయలక్ష్మి, రమ, వైదేహి, రోజారాణి పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేట: కృష్ణాదేవిపేటలో హెచ్ఐవీపై సోమవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఎయిడ్స్‌కు నివారణ తప్పితే మందులేదని వైద్యాధికారులు ఎస్.గాయత్రి, జ్యోతి చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది మహాలక్ష్మి, ప్రసన్న, సత్యనారాయణ, చిట్టిబాబు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ: ఎయిడ్స్ మహమ్మారిని అవగాహనతోనే తరుముదామని పీహెచ్‌సీ వైద్యాధికారి శ్యామ్‌కుమార్ అన్నారు. గొలుగొండలో హెచ్ఐవీపై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెచ్ఐవీ బాధితులు భయాందోళన చెందాల్సిన పనిలేదని ఆయన చెప్పారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తుఫాన్ జల్లులతో రైతుల ఆందోళన

పలు మండలాల్లో నీట మునిగిన వరి పనలు

రావికమతం/రోలుగుంట/మాడుగుల రూరల్/చీడికాడ/గొలుగొండ/కృష్ణాదేవిపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ రైతులను వణికించింది. తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షం జల్లులకు ఆరుగాలంగా శ్రమించిన పంట చేతికందే సమయంలో నీటి పాలవుతుందేమోనని వారు ఆందోళన చెందుతున్నారు. రావికమతం మండలంలోని ఖరీఫ్ సాగుగా ఈ ఏడాది మూడు వేల హెక్టార్లకు పైగా వరి పంటను సాగు చేశారు. ఇప్పటికే పండిన వరిని 30 శాతం కోసి రైతులు కుప్పలుగా పెట్టారు. మరో 150 ఎకరాలలో వరిని కోత కోయక తప్పని పరిస్థితిలో రైతులు రెండు రోజులుగా మడుల్లోనే ఆరవేశారు. ఈ తరుణంలో దిత్వా తుఫాన్ ప్రభావంతో ఆదివారం రాత్రి పడిన వర్షంతోపాటు సోమవారం మధ్యాహ్నం వరకు పడ్డ చిరు జల్లులకు వరి పనలు తడిచిపోయాయి. అలాగే గొలుగొండ మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ఉదయం చిరుజల్లులు పడ్డాయి. తుఫాను కారణంగా వర్షాలు పడుతున్నట్టు వాతావరణ శాఖ ప్రకటించడంతో వరిపంటల చేతికి అందే సమయంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. కృష్ణాదేవిపేట, ఏఎల్.పురం, చీడిగుమ్మల, గుండుపాల, పాతమల్లంపేట, అమ్మపేట, కొత్తమల్లంపేట, పాకలపాడు, ఏటిగైరంపేట గ్రామాల్లో వరి పంట కోత దశలో ఉంది. కొన్ని చోట్ల కోసిన వరి పనలు పొలాల్లోనే ఉన్నాయి. వర్షం జల్లులకు పొలాల్లో నీరు చేరి వరి పనలు దెబ్బతింటాయని రైతులకు దిగాలు పడ్డారు.

రోలుగుంట మండలంలో తుఫాన్ ప్రభావంతో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి పలు గ్రామాల్లో కోత కోసిన వరి పొలాలు తడిసిపోయాయి. రోలుగుంటలో పంట కోత దశకు వచ్చిన పొలాలను పలువురు రైతులు రెండు రోజుల క్రితం కోత కోశారు. కోసిన వరి పనలను పొలాల్లోనే వదిలేశారు. తుఫాన్ ప్రభావంతో వర్షం పడింది. దీంతో కోసిన వరి పొలాలు తడిసిపోయాయి. రోలుగుంట నుంచి కొండపాలెం రహదారి పక్కన వరి పొలాల్లోని పనలు వర్షానికి తడిసిపోయాయి.

మాడుగుల సోమవారం వేకువజాము నుంచే మండలంలో తేలికపాటి జల్లులు పడ్డాయ. కొంత సమయం తరువాత విరామం ఇచ్చి మరళా మధ్యాహ్నం వర్షం మొదలైంది. తరువాత మబ్బు వాతావరణమే నెలకొంది. తుఫాన్ కారణంగా పెద్ద వర్షాలు కురుస్తాయేమోనని, చేతికందే వరి పంటకు నష్టం వాటిల్లుతుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. చీడికాడ మండలంలోని అన్ని గ్రామాల్లోను ఓ మోస్తరు వర్షం కురవడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. ముందుగా నాట్లు వేసిన రైతులు పొలాల్లో వరిచేను గింజలు రాలుతున్నాయి. మూడు రోజుల ముందు అక్కడక్కడ కోతలు కోసి పొలాల్లో ఆరడానికి ఉంచారు. తుఫాన్ వర్షానికి పొలాల్లో నీరు చేరి వరి పనలు తడిచిపోతున్నాయని రైతులు వాపోయారు.


చీడికాడలోని ఓ పొలంలో వర్షానికి తడిసిన వరి పనలు

పెద్దేరు జలాశయం నుంచి 300 క్యూసెక్కుల నీరు విడుదల

మాడుగుల రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దేరు జలాశయం జలాశయంలో నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరింది. తుఫాన్ వర్షాలకు వరదనీరు వచ్చి చేరడంతో నీటి నిల్వలు పెరిగాయి. గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు కాగా, సోమవారం సాయంత్రానికి 136.25 మీటర్లకు చేరింది. ఇన్‌ఫ్లో 125 క్యూసెక్కులు వస్తున్నదని జలాశయం ఏఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు. దీంతో సోమవారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో జలాశయం మూడో నంబరు గేటు తెరిచి 300 క్యూసెక్కుల నీటిని నదీ ప్రవాహంలోకి విడిచి పెట్టినట్టు ఆయన తెలిపారు.

పాఠశాలల్లో సామాజిక తనిఖీలు

చోడవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, నాణ్యమైన విద్యా బోధనకు అనుసరిస్తున్న విధానాలపై సోమవారం సామాజిక తనిఖీలు నిర్వహించారు. కొత్తూరు బాలికల హైస్కూల్‌లో ఎంఈవోలు ఎం.పాండురంగారావు, కె.సింహాచలం తల్లిదండ్రుల కమిటీ సమక్షంలో తనిఖీలు చేశారు. పాఠశాలలో వసతులు, తరగతి గదులు, వంట షెడ్డు, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణ, పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించి యాప్‌లో నమోదు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఐవీ.రామిరెడ్డి, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ గుమ్మాల సత్య, సీఆర్పీ కేవీఎం నాయుడు పాల్గొన్నారు.

ఎస్ఐగా రుషికేశ్వరరావు బాధ్యతలు

కృష్ణాదేవిపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కృష్ణాదేవిపేట ఎస్ఐగా రుషికేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ వై.తారకేశ్వరరావు రెండు నెలల క్రితం నాతవరం స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి ఈ పోస్టు ఖాళీగా ఉంది. ఎట్టకేలకు అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ నుంచి బదిలీపై రుషికేశ్వరరావును నియమించారు. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, సిబ్బంది, ప్రజలు సహకరించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.


బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ రుషికేశ్వరరావు

యూత్ హాస్టల్ అడ్‌హాక్ యూనిట్ ప్రారంభం

నర్సీపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): యూత్ హాస్టల్ అడ్హాక్ నర్సీపట్నం యూనిట్‌ను సోమవారం ప్రారంభించారు. బలిఘట్టంలోని లయన్స్ క్లబ్ కార్యాలయంలో రాష్ట్ర యూత్ హాస్టల్ చైర్మన్ చీమల రవి కుమార్, వైస్ ప్రెసిడెంట్ జగపతిరాజు, కార్యదర్శి ఎండీ ఇబ్రహీం, కోశాధికారి ఇ.శ్రీనివాసరావు, లయన్స్ క్లబ్ పూర్వపు అధ్యక్షుడు దస్తాల రాఘవేంద్రరావు ఆధ్వర్యంలో యూనిట్‌ను ప్రారంభించారు. నర్సీపట్నం యూనిట్ కన్వీనర్లుగా పాలపర్తి సత్యానందం, డాక్టర్ అధికార గోపాలరావు, పందల శివ, కాపరపు శివప్రసాద్, కె.సోమిరెడ్డి ఎంపికయ్యారు. క్లబ్ సభ్యులు ఎం.రఘురాం, బాబూరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తడిసిన వరి పనలకు రక్షణ చర్యలు చేపట్టాలి

చీడికాడ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ వర్షాలకు తడిసిన వరిని కాపాడుకునేందుకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారిణి ఎ.కృష్ణవేణి సూచించారు. మండల కేంద్రం చీడికాడతో పాటు పలు గ్రామాల్లో తడిసిన వరిపనలను రైతులతో కలిసి ఆమె పరిశీలించారు. ఐదు శాతం ఉప్పు ద్రావణం తడిసిన పనలపై పిచికారీ చేయాలని సూచించారు. ఇప్పటికే కళ్లాలకు తెచ్చిన వరి పనలు నూర్చితే, ఆ ధాన్యం వర్షానికి తడవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రెండు, మూడు రోజుల పాటు వరి కోతలను రైతులు వాయిదా వేసుకోవాలని ఆయన కోరారు.

మట్టి తవ్వకాలను నిలిపివేయాలి

దేవరాపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మట్టి తవ్వకాలను వెంటనే నిలుపుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి.వెంకన్న కోరారు. ఈ మేరకు సోమవారం తహశీల్దార్ లక్ష్మీదేవిని కలిసి వినతిపత్రం అందశారు. సామాన్య రైతు పొలం, కల్లానికి మట్టి తరలిస్తే వాహనాలు సీజ్ చేసే అధికారులు, జిరాయితీ భూముల్లో మట్టికి అనుమతులు ఇచ్చామంటూ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మండల కంద్రంలో మట్టి తవ్వకాలను వెంటనే నిలుపుదల చేయాలని ఆయన కోరారు.

వంద రోజుల పని వినియోగంపై అవగాహన సదస్సు

గొలుగొండ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో వంద రోజుల పని వినియోగించుకోవడంపై సోమవారం కూలీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. సోషల్ ఆడిట్‌లో భాగంగా పలు గ్రామాల్లో సభలు ఏర్పాటు చేశారు. గొలుగొండ, గుండుపాల గ్రామాల్లో నిర్వహించిన సభల్లో డీఆర్పీ రమణబాబు మాట్లాడుతూ కూలీలు వంద రోజుల పని దినాల్లో తప్పనిసరిగా పాల్గొనాలని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ అప్పారావు, టీడీపీ నేత రమేశ్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఆమె బోధన వినూత్నం



పాఠ్యాంశాల చిత్రాలతో విద్యార్థినులు

- పిల్లలను ఆకట్టుకునే రీతిలో పాఠాలు
- వీడియోలు, చార్టుల రూపకల్పన
- సామాజిక మాధ్యమాల్లో లక్షల మంది వీక్షకులు
- పినగాడి ప్రాథమిక పాఠశాల ఎస్జీటీకి మంత్రి లోకేశ్ అభినందన



విద్యార్థులతో ఉపాధ్యాయిని అలివేలి

విశాఖపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): **సంప్రదాయ విధానంలో బోధన కంటే పిల్లలకు అర్థమయ్యేందుకు వినూత్న తరహాలో పాఠాలు చెబుతూ విద్యార్థులను ఆకట్టుకుంటున్నారు ఉపాధ్యాయురాలు పల్దాసింగి అలివేలి. ఈ క్రమంలో అందరి మన్ననలు పొందుతున్నారు. సామాజిక మాధ్యమాల్లో లక్షల వీక్షకులను సంపాదించుకున్న ఆమె, పిల్లల కోసం ఇంతవరకు 110 వీడియోలు రూపొందించారు. వాటిని వీక్షించిన మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి నారా లోకేశ్ అలివేలి కృషిని ప్రశంసిస్తూ ఎక్స్‌లో పోస్టు చేశారు.**

పెందుర్తి మండలం పినగాడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పల్దాసింగి అలివేలు పనిచేస్తున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలుకు చెందిన ఆమె 2014 డీఎస్సీలో ఎంపికై 2016లో ఎస్జీటీగా పెదబయలు మండలం బాసులలో సుమారు ఎనిమిదేళ్లు పనిచేశారు. మండల కేంద్రానికి 25 కి.మీ. దూరంలో ఉన్న బాసులకు వెళ్లాలంటే సుమారు ఆరేడు కిలోమీటర్లు కాలినడకన అడవిలో ప్రయాణించాలి. అయినప్పటికీ వెరవక ప్రతిరోజూ పాఠశాలకు వెళ్లి ఉత్తమ బోధనతో తల్లిదండ్రుల మన్ననలు పొందారు. టీచర్ల బదిలీల్లో భాగంగా 2023లో పెందుర్తి మండలం పినగాడి ప్రాథమిక పాఠశాలకు వచ్చారు.

నగరానికి ఆనుకుని ఉన్న పినగాడిలో చాలామంది తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపేందుకు మక్కువ చూపుతున్నారు.ఈ పరిస్థితులలో పిల్లలకు రొటీన్‌గా పాఠాలు బోధిస్తే ఫలితం ఉండదని గుర్తించిన అలివేలి, వినూత్న విధానానికి శ్రీకారం చుట్టారు. సబ్జెక్టు కంటే పిల్లలు ఇష్టపడేలా రైమ్స్, పాటలు, నృత్యాలు, బొమ్మలతో ఆమె బోధన ప్రారంభించారు. పిల్లలకు అర్థమయ్యేలా, లాజికల్‌గా, వివరణాత్మకంగా బోధిస్తున్నారు. వాటిపై వీడియోలు రూపొందించారు. ప్రధానోపాధ్యాయుడు, పిల్లలను భాగస్వాములను చేశారు. రెండోతరగతి చదివే అయిషాతో ఫోర్ బుల్లెట్ పేరుతో వీడియోలు రూపొందించారు. దీనికి మంచి స్పందన వచ్చింది. మిస్ యూనిక్ పేరుతో ఇన్‌స్టాగ్రామ్‌లో అప్‌లోడ్ చేశారు. ఈ వీడియోకు 1.65 లక్షల మంది వీక్షకులున్నారు. లక్షలలో లైక్‌లు వచ్చా యి. ఇలా 110 వీడియోలు రూపొందించారు. వీటినితిలకించిన మంత్రి లోకేశ్ ఎక్స్ వేదికగా స్పందించి, అలివేలి ప్రతిభను అభినందించారు. ఆటపాటలతో విద్యాబుద్ధులు నేర్పుతున్న తీరు చాలా బాగుంది. లెర్నింగ్ మేడ్ ఈజీ విత్ యాక్టివిటీస్ విధానం పిల్లల్లో చదువుపై ఆసక్తి కనబర్చుతుంది. యూనిక్ ఇన్నోవేటివ్ టీచింగ్ మెథడ్స్, నో బ్యాగ్ డే యాక్టివిటీ, వర్డ్ బిల్డింగ్, ఎఫ్ఎల్ఎన్ ఆధారిత బోధనతో పాఠాలు బోధిస్తూనే సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్న అలివేలి కృషి ప్రశంసనీయమని లోకేశ్ ఎక్స్‌లో పేర్కొన్నారు.

పిల్లల్లో సృజనాత్మకతకు దోహదం



సెల్‌ఫోన్‌లు, టీవీలు వచ్చిన తరువాత పిల్లల ఆలోచనలు మారాయి. రొటీన్‌గా పాఠాలు బోధించడం కంటే కొత్తదనంతో చెబితే వారిలో సృజనాత్మకత వెలుగులోకి వస్తుందని భావించాను. పెదబయలులో ఉండగా కొంతవరకు అమలుచేశా. పినగాడి వచ్చిన తరువాత ప్రైవేటు పాఠశాలల పోటీ తట్టుకునేందుకు వినూత్న బోధనకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నా. తల్లిదండ్రులకు విషయం చెబుతూ పిల్లల్లో మానసిక వికాసం, చదువుపై ఆసక్తి పెరుగుతుందని ఫీడ్‌బ్యాక్ తీసుకుంటున్నాం. విద్యాశాఖ రూపొందించిన సిలబస్‌నే కొత్తగా బోధిస్తున్నాం. మంత్రి లోకేశ్ అభినందించడం ఉత్సాహాన్ని ఇచ్చింది. ప్రధానోపాధ్యాయుడు, విద్యాశాఖాధికారులు, గ్రామస్థుల ప్రోత్సాహంతో వినూత్న రీతిలో బోధిస్తున్నా.

- పల్దాసింగి అలివేలి, ఎస్జీటీ, పినగాడి ప్రాథమిక పాఠశాల

వన్నె తగ్గిన వలిసె

... 5వ పేజీ తరువాయి

తగ్గుముఖం పడుతుండడం వలన ఏజెన్సీ ప్రాంతంలో తేనె ఉత్పత్తిపైనా దాని ప్రభావం పడుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు అంటున్నారు. తేనె టీగలకు అవసరమైన మకరందం వలిసె పంటలో అధికంగా ఉండడంతో తేనె ఉత్పత్తి బాగుండేదని, కాని నేడు అందుకు భిన్నమైన పరిస్థితులు కొనసాగుతున్నాయని వ్యవసాయాధికారులు అంటున్నారు. ఫలితంగా మన్యంలో క్రమంగా తేనె ఉత్పత్తి తగ్గుతుందని పేర్కొంటున్నారు.

ప్రతికూల పరిస్థితుల్లో వలిసెకు దూరం

చాలా ఏళ్లుగా మన్యానికి ప్రత్యేక గుర్తింపు, గిరిజన రైతులకు ఆదాయాన్ని తెచ్చిపెట్టే వలిసె పంటకు ప్రతికూల పరిస్థితులు అధికం కావడంతో గిరిజన రైతులకు వలిసె పంట క్రమంగా దూరమైంది. ప్రధానంగా వలిసె పూలు వికసించే అక్టోబరు, నవంబరు నెలల్లో వర్షాలు కురుస్తుండడంతో పంట నాశనం కావడంతోపాటు ఆనుకోని విధంగా ఆకాశపందిరి మొక్కలు పంటను ఆశించడంతో మొక్క దశలోనే పంట పాడవడం మొదలైంది. ఆకాశపందిరి కలుపు మొక్కలు వలిసె మొక్కకు ఒక తీగలాంటిది మొత్తం మొక్కను చుట్టేసి ఎదుగుదల లేకుండా చేసేయడంతో పంట నాశనమైపోయేది. వలిసె పంటపై ఆధారపడిన గిరిజన రైతులకు ఆ పంట చేతికి వస్తుందనే నమ్మకం లేకుండాపోయింది. దీంతో క్రమంగా వలిసె పంటకు గిరిజన రైతులు దూరమయ్యారు. అదే క్రమంలో చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో రాజ్‌మా పంటపై జరిగిన పరిశోధనలు ఫలించడంతో తొలుత చింతపల్లి, జీకేవీధి మండలాల్లోని గిరిజన రైతులు వలిసె స్థానంలో రాజ్‌మా పంటను సాగు చేయడం ప్రారంభించారు. దానికి ఎటువంటి తెగులు, ఇతర సమస్యలు తలెత్తకుండా దిగుబడి సైతం ఆశాజనకంగా ఉండడంతో క్రమంగా రాజ్‌మా సాగుపైనే గిరిజన రైతులు ఆసక్తి కనబరిచారు. ఏజెన్సీలో చింతపల్లి, జీకేవీధిలో ప్రారంభమైన రాజ్‌మా పంట సాగు క్రమంగా ఏజెన్సీలోని అన్ని మండలాలకు విస్తరించింది. దీంతో వలిసె పంట విస్తీర్ణం తగ్గి, దాని స్థానంలో రాజ్‌మా పంట 20 వేల ఎకరాలు పైబడి విస్తీర్ణం పెరిగింది. అలాగే గిరిజన రైతులకు సైతం రాజ్‌మా పంటతో ఆశించిన దాని కంటే ఎక్కువ ఆదాయం లభిస్తుండడంతో ఆ పంటపైనే ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. అయితే అధికారులు మన్యంలోని వలిసె సాగుకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

ఏవోబీలో భద్రత కట్టుదిట్టం

... 5వ పేజీ తరువాయి

సరిహద్దులోని సీలేరు పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి ఎస్ఐ యాసిన్ ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్ బలగాలు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.

నేటి నుంచి 8 వరకు ఆర్టీసీ నైట్ సర్వీసులు రద్దు

మావోయిస్టుల పీఎల్‌జీఏ వారోత్సవాల నేపథ్యంలో మంగళవారం నుంచి ఈ నెల 8వ తేదీ వరకు విశాఖపట్నం డిపో నుంచి సీలేరు మీదుగా నడిపే విశాఖపట్నం- సీలేరు నైట్ హాల్ట్, విశాఖపట్నం- భద్రాచలం, అలాగే భద్రాచలం- విశాఖపట్నం నైట్ సర్వీసులను రద్దు చేసినట్టు విశాఖ డిపో డీఎం మాధురి తెలిపారు. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా నైట్ సర్వీసులను రద్దు చేశామని పేర్కొన్నారు.

డొంకరాయి నుంచి నీటి విడుదల నిలిపివేత

... 5వ పేజీ తరువాయి

ఏపీ జెన్‌కో గ్రిడ్ ఉన్నతాధికారుల నుంచి అనుమతులు తీసుకున్నామన్నారు. ఈ రెండు నెలల పాటు 460 మెగావాట్ల సామర్థ్యం గల పొల్లూరు, 25 మెగావాట్ల సామర్థ్యం గల డొంకరాయి జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తిని నిలిపివేయనున్నట్టు ఆయన చెప్పారు. అలాగే ఈ షట్‌డౌన్ సమయంలో పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో గల 115 మెగావాట్ల సామర్థ్యం గల నాలుగు యూనిట్లకు కొన్ని ఆపరేషన్ నిర్వహణ పనులు చేయడానికి ప్రతిపాదనలు చేశామన్నారు. అలాగే 25 మెగావాట్ల సామర్థ్యం గల డొంకరాయి మినీ జలవిద్యుత్ కేంద్రంలో యూనిట్ క్యాపిటల్ ఓవరాయిలింగ్ పనులను కూడా నిర్వహించనున్నామని చెప్పారు. డొంకరాయి నుంచి ఫోర్‌బే వరకు గల 16 కిలోమీటర్ల పవర్ కెనాల్ ఒకటి, రెండు రీచ్‌ల్లో సీపేజీని నిలిపివేయడం కోసం నిర్వహణ పనులను కూడా నిర్వహిస్తున్నామన్నారు. సీలేరు కాంప్లెక్సు పరిధిలో ఈ రెండు నెలల పాటు విద్యుత్ డిమాండ్, గ్రిడ్ అధికారుల ఆదేశాల మేరకు ఎగువ సీలేరు జలవిద్యుత్ కేంద్రంలో మాత్రమే విద్యుదుత్పత్తి జరుగుతుందని ఆయన చెప్పారు.

అర్జీల పరిష్కారంపై దృష్టి

అధికారులకు కలెక్టర్ ఆదేశం



అర్జీదారునితో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్



ఫిర్యాదీతో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి కలెక్టరేట్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌కు వచ్చే అర్జీల పరిష్కారంపై దృష్టి పెట్టాలని అధికారులను కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. డీఆర్వో వై.సత్యనారాయణరావుతో కలిసి ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ శాఖలకు సంబంధించి 276 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ అర్జీ నమోదు చేయాలన్నారు. ప్రజలు అందించిన అర్జీలను సంబంధిత శాఖలు పరిష్కార దిశగా తీసుకుంటున్న చర్యలను నిరంతరం ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలన్నారు. పీజీఆర్ఎస్‌కు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందని, అప్రమత్తంగా ఉండాలన్నారు. అర్జీదారులతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

నిర్ణీత గడువులోగా అర్జీల పరిష్కారం

- ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో అందిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ఆయన పాల్గొని అర్జీదారుల నుంచి 70 వినతులు స్వీకరించారు. అర్జీదారులతో నేరుగా ఆయన మాట్లాడి వారి గోడును ఆలకించారు. సమస్యల పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు బదలాయించారు. భూ వివాదాలు, మోసాలు, కుటుంబ కలహాలు వంటి సమస్యలపై వినతులు అందినట్టు ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ ఎల్.మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు ఖోఖో జట్ల ఎంపిక



జాతీయ ఖోఖో పోటీలకు ఎంపికైన బాలుర జట్టుతో డీఈవో గిడ్డి అప్పారావునాయుడు, తదితరులు



ఎంపికైన బాలికల జట్టు

లంకెలపాలెం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో అండర్ - 14 బాలుర, బాలికల జాతీయ స్థాయి ఖోఖో జట్లను లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం రాత్రి ఎంపిక చేశారు. మూడు రోజులు పాటు ఇక్కడ జరిగిన రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొని ప్రతిభ కనబరిచిన సంగతి తెలిసిందే. ఈ పోటీల్లో విశేషంగా రాణించిన క్రీడాకారులను ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ నెలాఖరులో రాజస్థాన్‌లో జరిగే జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో ఏపీ నుంచి రెండు జట్లు పాల్గొంటాయని ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు తెలిపారు. కాగా ఎంపికైన క్రీడాకారులను జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు, కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్‌లు అభినందించారు. ఈకార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కేఎం నాయుడు, హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు, ఎస్‌జీఎఫ్ మాజీ కార్యదర్శి ఎంవీ. నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు ఎంపికైన బాలుర జట్టు

జె.హర్షవర్ధన్(విశాఖపట్నం), జి.మనోహర్‌నాయుడు(విశాఖపట్నం), టి.సూర్యనారాయణ(చిత్తూరు), ఎస్.బద్రీనాథ్(చిత్తూరు), టి.శృతి సాయి కీర్తన్(విశాఖపట్నం), ఎం.శ్రీకాంత్(గుంటూరు), సి.నగేశ్(కర్నూల్), కె.వెంకటసాయి(ప్రకాశం), ఎ.భూపతిరెడ్డి(తూర్పు గోదావరి), బి.కార్తీక్(శ్రీకాకుళం), ఎస్.రామ్‌చరణ్(కడప), కె.చరణ్ (విశాఖపట్నం).

బాలికల జట్టు

ఆర్.సృతిక(విశాఖపట్నం), ఆర్.లలితాదేవి(విశాఖపట్నం), ఎం.యువశ్రీ (చిత్తూరు), పి.జయశ్రీ(చిత్తూరు), ఎన్.అర్చనారెడ్డి(చిత్తూరు), జి.చందన(శ్రీకాకుళం), కె.పావని(విజయనగరం), టి.సింధు (ప్రకాశం.), ఎన్.బంధవిక(కృష్ణా), జి.అనుపమ(కడప), ఆర్.వీణ (అనంతపురం), టి.ప్రియ(తూర్పుగోదావరి).

రోజంతా ముసురు

... 5వ పేజీ తరువాయి

16.3, ముంచంగిపుట్టులో 16.4, అనంతగిరిలో 17.2, కొయ్యూరులో 20.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

అరకులోయలో...

అరకులోయ: మండలంలో సోమవారం రోజంతా ముసురు వాతావరణం నెలకొంది. దీంతో జన జీవనానికి ఆటంకం ఏర్పడింది. వేకువజాము నుంచి పొగమంచు దట్టంగా కురవడం, ఆ తరువాత మోస్తరు వర్షం పడడంతో విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు ఇబ్బంది పడ్డారు.

హుకుంపేటలో...

హుకుంపేట: మండలంలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. వరి కోతలు కోసి కుప్పలు పెట్టిన రైతులు అవి తడిసిపోవడంతో ఆవేదన చెందారు. పలు రహదారులు చిత్తడిగా మారడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

చింతపల్లిలో..

చింతపల్లి: మండలంలో సోమవారం తేలికపాటి వర్షం కురిసింది. ఉదయం నుంచి రాత్రి వరకు తేలికపాటి వర్షం కురిసింది. శీతల గాలులు అధికంగా వీయడంతో చలి తీవ్రత మరింతగా పెరిగింది. వర్షం వల్ల అన్నవరం వారపు సంతలో వినియోగదారులు, వర్తకులు ఇబ్బంది పడ్డారు. వరి కోతలు కోసే రైతులు, కాఫీ పండ్ల సేకరణ చేపడుతున్న రైతులు అవస్థలు పడ్డారు. కాగా సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలోనూ లంబసింగి గ్రామం, ఘాట్‌లో పొగమంచు కమ్ముకుని వుంది. ఓ వైపు చిరుజల్లుల వర్షం కురుస్తుంది. మరోవైపు పొగమంచు కమ్ముకుని వుండడంతో వాహనచోదకులు లైట్లు వేసుకుని నెమ్మదిగా ప్రయాణించాల్సి వచ్చింది. కాగా పర్యాటకులు ఈ భిన్నవాతావరణాన్ని ఆస్వాదించారు.



అనంతగిరిలో దట్టంగా కమ్ముకున్న పొగమంచు

అనంతగిరిలో...

అనంతగిరి: దిత్వా తుఫాన్ ప్రభావంతో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. సోమవారం ఉదయం దట్టంగా పొగమంచు కమ్ముకుంది. ఉదయం 10 గంటలైనా మంచు తెరలు వీడకపోవడం వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణాలు సాగించారు.

క్రైం... crime news

ముగ్గురి ప్రాణాలు నిలిపిన మహోన్నతుడు

- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చెట్టుపల్లికి చెందిన రాజు మృతి
- పెద్ద మనస్సుతో అవయవాలను దానం చేసిన కుటుంబ సభ్యులు



మేడిశెట్టి రాజు (ఫైల్)

నర్సీపట్నం అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఇంటి పెద్ద చనిపోయినా తన అవయవాల ద్వారా మరో ముగ్గురి ప్రాణాలు నిలిపి ఆదర్శంగా నిలిచారు ఆ కుటుంబ సభ్యులు. ఇందుకు సంబంధించిన వివరాలివి. నర్సీపట్నం మండలం చెట్టుపల్లి గ్రామానికి చెందిన మేడిశెట్టి రాజుకు తీవ్ర అనారోగ్యం కావడంతో కుటుంబ సభ్యులు ఆదివారం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకు వెళ్లారు. వైద్యులు విశాఖ కిమ్స్ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు బ్రెయిన్ డెడ్‌కు గురయ్యారు. ఇతనికి భార్య వరలక్ష్మి, కుమార్తె ఉన్నారు. అయితే కుటుంబ సభ్యులు ఇతని అవయవాలను దానం చేయడానికి ముందుకు వచ్చారు. అదే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ పేషెంట్‌కు లివర్ అమర్చారు. తిరుపతిలో చికిత్స పొందుతున్న ఒకరికి గుండె, ఇంకొకరికి ఊపిరితిత్తులను గ్రీన్ చానల్ ఏర్పాటు చేసి పంపించారు.

పేకాట ఆడుతున్న ఎనిమిది మంది అరెస్టు

బుచ్చెయ్యపేట, డిసెంబరు 1 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని రాజాం గ్రామంలో పేకాట శిబిరంపై పోలీసులు సోమవారం దాడి చేశారు. ముందస్తు సమాచారం మేరకు ఎస్ఐ శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి వెళ్లారు. ఈ సందర్భంగా ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి 3,660 నగదును స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు.

మొర్రిగుడ పాఠశాలలో తనిఖీ

- మధ్యాహ్న భోజనం అమలు తీరును పరిశీలించిన డీఈవో



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈవో బ్రహ్మాజీరావు

డుంబ్రిగుడ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని మొర్రిగుడ ఎంపీయూపీ పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు సోమవారం తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. నిర్మాణ దశలో ఉన్న పాఠశాల భవనాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సుందరరావు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

నేవీ డే లేనట్టే!

- ఈసారి సాహస విన్యాసాలకు దూరం
- ఫిబ్రవరిలో ఐఎఫ్ఆర్, మిలాన్‌ల నేపథ్యంలో రద్దు

విశాఖపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నేవీ డే సందర్భంగా తూర్పు నౌకాదళం ప్రతి ఏటా డిసెంబరు 4వ తేదీ సాయంత్రం రామకృష్ణా బీచ్‌లో నిర్వహించే సాహస విన్యాసాల ప్రదర్శన ఈ ఏడాది కనిపించే అవకాశం లేదు. దీనికి సంబంధించి ఇప్పటికే ఏర్పాట్లు, రిహార్సల్స్ పూర్తయ్యేవి. విశాఖ గగన వీధుల్లో యుద్ధ విమానాలు చక్కర్లు కొట్టాల్సిన సమయం. కానీ ఈసారి వాటి జాడ లేదు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 15 నుంచి 25 వరకు విశాఖపట్నంలో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ, మిలాన్-2026ను భారీఎత్తున నిర్వహించడానికి నేవీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. భారత రాష్ట్రపతి, ప్రధాని, ముఖ్యమంత్రి, తదితర ప్రముఖులు హాజరవుతారు. ఇందులో సుమారు 50 దేశాలకు పైగా పాల్గొంటాయి. ఇవి అతి పెద్ద కార్యక్రమాలు కావడం, అప్పుడు కూడా ఆర్‌కే బీచ్‌లో నేవీ సాహస విన్యాసాలు నిర్వహించాల్సి ఉండడంతో తాజాగా నేవీ డే నిర్వహించడం లేదని తెలిసింది. గత ఏడాది ఒడిశాలోని పూరి తీరంలో నేవీ డే నిర్వహించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆ తరువాత జనవరి 4న విశాఖలో ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, సతీమణి భువనేశ్వరి, మనవడు దేవాన్ష్‌తో కలిసి హాజరయ్యారు.

బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షునిగా కిల్లాడ



ఓబీసీ మోర్చా జిల్లా నాయకులకు నియామక పత్రం అందజేస్తున్న దృశ్యం

కొత్తూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ ఓబీసీ మోర్చా అనకాపల్లి జిల్లా అధ్యక్షునిగా కిల్లాడ వెంకట సత్యనారాయణ నియామకమయ్యారు. ఈ మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు జిల్లా నాయకుల జాబితాను సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ప్రకటించారు. జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షునిగా శరగడం వరాహ వెంకట శంకరరావు, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలిగా ఓరుగంటి నాగమణి, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షునిగా గోటివాడ స్వామ్రాట్‌కుమార్, జిల్లా మైనార్టీ మోర్చా అధ్యక్షునిగా షేక్ బాబాజీలను నియమించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు బొడ్డేడ నాగేశ్వరరావు, రత్నభరత్, ఉపాధ్యక్షుడు పలకా రవి తదితరులు పాల్గొన్నారు.

శత శాతం ధ్యేయం

... 5వ పేజీ తరువాయి

అంచనా వేశారు. ఇందులో తొలివిడతలో మొత్తం 2,53,915 మంది (విశాఖ జిల్లాలో 78,676 మంది, అనకాపల్లిలో 89,944, అల్లూరి జిల్లాలో 85,284)ని అక్షరాస్యులను చేయాలని అధికారులు ప్రతిపాదించారు. ప్రధానంగా ఉపాధి హామీ పథకం కూలీలు, డ్వాక్రా సంఘాల సభ్యులను అక్షరాస్యులను చేయడం ద్వారా ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యత సాధించడంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టిసారించారు. దీనికి అనుగుణంగా అక్షర ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆడియో, వీడియో పాఠాలతోపాటు రాయడం, చదవడం, చిన్న చిన్న కూడికలు, తీసివేతలు నేర్పిస్తున్నారు. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా ప్రాథమిక అక్షరాస్యత, సాంఖ్యక శాస్త్రం, జీవ, వృత్తి నైపుణ్యాలు, ప్రాథమిక విద్య, నిరంతర విద్య కార్యక్రమాలు అమలుచేస్తారు. అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో నిరక్ష్యరాస్యులకు ఇప్పటికే తరగతులు ప్రారంభమయ్యాయి. త్వరలో విశాఖ జిల్లాలోనూ నిర్వహిస్తామని జిల్లా వయోజన విద్యా ఉప సంచాలకుడు ఎస్.సుబ్రహ్మణ్యం తెలిపారు. అల్లూరి, అనకాపల్లి జిల్లాల్లో నిరక్షరాస్యులకు వచ్చే ఏడాది మార్చిలో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ప్రతి ఒక్కరికీ చదవడం, రాయడం, చిన్నపాటి కూడికలు, తీసివేతలు, సంతకం నేర్పుతున్నామన్నారు. ఒక వాచకం కూడా అందజేశామన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	110.00
లైవ్ ధర	130.00
విత్ స్కిన్	230.00
స్కిన్ లెస్	240.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	630
విజయనగరం	634
శ్రీకాకుళం	634